# 15 లక్షల కోట్లు పెరిగిన సంపద

**గత ఐదు రోజుల్లో పరుగులు పెట్టిన మార్కెట్ క్యాప్**

**వరుస లాభాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు**

**ఒక్కరోజే సెన్సెక్స్ 810, నిఫ్టీ 241 పాయింట్లు వృద్ధి**

**ఐటీ, టెక్ కంపెనీల షేర్లు ఆకర్షణీయం**



ముంబై, డిసెంబర్ 5: దేశీయ స్టాక్ మార్కెట్లు పడుతూ.. లేస్తూ.. పయనించినా, ఆఖర్లో మాత్రం లాభాల్లోనే ముగుస్తున్నాయి. ఇలా వరుసగా 5 రోజుల్లో మదుపరుల సంపద సైతం లక్షల కోట్ల రూపాయల్లో పెరగడం విశేషం. గురువారం ఒక్కరోజే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 809.53 పాయింట్లు లేదా 1 శాతం పుంజుకొని 81,765.86 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 1,361.41 పాయింట్లు ఎగబాకడం గమనార్హం. అయితే ఈ దశలో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో సూచీ దిగిరాక తప్పలేదు. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 240.95 పాయింట్లు లేదా 0.98 శాతం ఎగిసి 24,708.40 దగ్గర నిలిచింది.

**అమెరికా జోష్**

భారతీయ ఈక్విటీలు ఇంతలా బలపడటానికి అమెరికా మార్కెట్ల ర్యాలీ బాగా కలిసొచ్చింది. అగ్రరాజ్య ఆర్థిక వ్యవస్థ ఆకర్షణీయ వృద్ధిని కనబరుస్తుండటం, ద్రవ్యోల్బణం దిగొస్తుండటంతో తొలిసారి డోజోన్స్ 45వేల మార్కును దాటింది. అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించిన దగ్గర్నుంచీ అమెరికా వృద్ధి సూచీలు పరుగులు పెడుతున్నాయి మరి. అక్కడి ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ చీఫ్ పావెల్ కూడా దేశ ఆర్థిక ముఖచిత్రం బాగుపడిందని కొనియాడటం.. మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత బలపర్చింది. ఇక దేశీయంగా చూస్తే.. ఐటీ కంపెనీల షేర్లు ఇన్వెస్టర్లను అమితంగా ఆకట్టుకున్నాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా షేర్లు భారీ లాభాలను అందుకున్నాయి. ఐటీ రంగ సూచీ గరిష్ఠంగా 1.96 శాతం పెరిగింది.

**ఎఫ్ఐఐ కొనుగోళ్లు**

గతకొంత కాలంగా దేశీయ మార్కెట్ల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ దిశగా అడుగులు వేస్తున్న విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ).. మళ్లీ కొనుగోళ్ల వైపు వచ్చారు. బుధవారం రూ.1,797.60 కోట్ల విలువైన షేర్లను కొన్నట్టు స్టాక్ ఎక్స్ఛేంజీ వర్గాలు తెలిపాయి. దీంతో గురువారం సైతం ఇదే జోష్ ఉందన్న అంచనాలు వస్తున్నాయి. ఇక సెన్సెక్స్‌లో టైటాన్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లూ పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 0.27 శాతం, స్మాల్‌క్యాప్ 0.16 శాతం అందిపుచ్చుకున్నాయి. ఇక శుక్రవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాలు ఉండనున్నాయి. దీంతో మార్కెట్ ట్రేడింగ్‌పై ఈ ప్రభావం ఎక్కువేనని చెప్పవచ్చు. గత ఏడాది ఏప్రిల్ నుంచి కీలక వడ్డీరేట్లను ఆర్బీఐ యథాతథంగానే ఉంచుతున్న విషయం తెలిసిందే.

### రూ.458 లక్షల కోట్లకు..

*వరుసగా ఐదోరోజూ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగియడంతో ఆయా సంస్థల మార్కెట్ విలువ కూడా అదే స్థాయిలో పెరుగుతూపోతున్నది. గడిచిన 5 రోజుల్లో బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.15,18,926.69 కోట్లు ఎగిసి రూ.4,58,17,010.11 కోట్లకు (5.41 ట్రిలియన్ డాలర్లు) చేరింది. ఈ ఐదు రోజుల్లో సెన్సెక్స్ 2,722.12 పాయింట్లు లేదా 3.44 శాతం పుంజుకున్నది. 'అంతర్జాతీయ మార్కెట్లలో డోజోన్స్, ఎస్ అండ్‌పీ 500, నాస్‌డాక్ లాభాల్లో కదలాడుతుండటం.. భారతీయ మార్కెట్లకు లాభిస్తున్నది' అని మెహెతా ఈక్విటీస్ లిమిటెడ్ రిసెర్చ్ విభాగం సీనియర్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ తాప్సీ అన్నారు. ఇక గురువారం జపాన్, చైనా సూచీలు లాభాల్లో, దక్షిణ కొరియా, హాంకాంగ్ సూచీలు నష్టాల్లో ముగిశాయి.*



### లక్ష డాలర్లకు బిట్‌కాయిన్

న్యూయార్క్, డిసెంబర్ 5: అదృశ్య కరెన్సీ బిట్‌కాయిన్ జెట్‌స్పీడ్ వేగంతో దూసుకుపోతున్నది. రోజుకొక రికార్డు స్థాయికి చేరుకుంటున్న ఈ బిట్‌కాయిన్ తాజాగా లక్ష డాలర్లకు చేరుకున్నది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ గెలిచినప్పటీ నుంచి ఈ కరెన్సీ భారీగా పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో గురువారం బిట్‌కాయిన్ విలువ 103,400 డాలర్లకు ఎగబాకింది. ఈ ఏడాది ఈ అదృశ్య కరెన్సీని కొనుగోలు చేసిన వారు కోటీశ్వరులైనారని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి.

### అరబిందో క్యాన్సర్ ఔషధానికి అమెరికా ఓకే

హైదరాబాద్, డిసెంబర్ 5: అరబిందో ఫార్మాకు చెందిన క్యాన్సర్ వ్యాధిని నియంత్రించే జనరిక్ ఔషధానికి అమెరికా నియంత్రణ మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కంపెనీకి చెందిన అనుబంధ సంస్థయైన యుగియా ఫార్మా తయారు చేఇంది పాజోపానిబ్ ట్యాబ్లెట్ అమెరికా మార్కెట్లో విడుదల చేయడానికి లైన్‌క్లియర్ అయింది. దీంతో ఈ ఔషధం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం నాటికి అక్కడి మార్కెట్లోకి విడుదల చేయబోతున్నది.

## హ్యుందాయ్ కార్లు ప్రియం



న్యూఢిల్లీ, డిసెంబర్ 5: ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన హ్యుందాయ్ మోటర్ ఇండియా కూడా తన వాహన ధరలు పెంచబోతున్నట్లు ప్రకటించింది. జనవరి 1 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల వాహన ధరలను రూ.25 వేల వరకు పెంచుతున్నట్లు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు ఫారెక్స్ మార్కెట్లో కరెన్సీ హెచ్చుతగ్గుదలకు లోనుకావడం, లాజిస్టిక్స్ ఖర్చులు అధికం కావడం వల్లనే ధరలు పెంచాల్సి వచ్చిందని కంపెనీ డైరెక్టర్, సీవోవో తరుణ్ గార్గ్ వెల్లడించారు. కొత్త మాడల్‌తోపాటు పాత మాడళ్లకు కూడా ఈ ధరల పెంపు వర్తించనున్నదన్నారు. ప్రస్తుతం సంస్థ రూ.5.92 లక్షల విలువైన గ్రాండ్‌ఐ10 నియోస్ నుంచి రూ.46.05 లక్షల విలువైన ఎలక్ట్రిక్ వాహనం అయోనిక్ 5 మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది.

## సన్‌టెక్ ఎనర్జీ నుంచి ట్రూజెన్ సోలార్ బ్రాండ్

- **ప్రచారకర్తగా మహేశ్ బాబు..**




హైదరాబాద్, డిసెంబర్ 5: ప్రముఖ సోలార్ ఎనర్జీ సంస్థ సన్‌టెక్ ఎనర్జీ..తాజాగా మరో బ్రాండ్ ట్రూజెన్ సోలార్ బ్రాండ్‌ను మార్కెట్‌కు పరిచయం చేసింది. ఈ బ్రాండ్‌కు మార్కెట్లో మరింత ప్రచారం కల్పించడానికి తెలుగు హీరో మహేష్ బాబును ప్రచారకర్తగా నియమించుకున్నది. ఈ సందర్భంగా కంపెనీ ఫౌండర్, ఎండీ భవాని సురేశ్ మాట్లాడుతూ..పునరుత్పాదక విద్యుత్ రంగంలో వస్తున్న పెను మార్పులకు అనుగుణంగా సరికొత్త బ్రాండ్‌ను పరిచయం చేసినట్లు, దేశంలో ఐదు అతిపెద్ద సోలార్ ఈపీసీ కంపెనీల్లో ఒకటిగా నిలిచేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇందు కోసం తెలుగు హీరో మహేష్ బాబును బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నట్లు చెప్పారు. అలాగే వ్యాపార విస్తరణలో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా 150కి పైగా డీలర్లను నియమించుకోనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఇరు రాష్ట్రాల్లో 60 డీలర్లు ఉన్నారు. దేశవ్యాప్త విస్తరణలో భాగంగా మధ్యప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల్లో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లను నెలకొల్పుతున్నట్లు, తద్వారా ఆయా రాష్ట్రాల్లో సౌర పరికరాలు విక్రయించడానికి మరింత సులభతరం కానున్నదన్నారు.

## వాటి జోలికి వెళ్లొద్దు: సెబీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 5: అనామక ఆన్‌లైన్ వేదికల ద్వారా లభించే అన్‌లిస్టెడ్ డెట్ సెక్యూరిటీస్‌తో జాగ్రత్తగా ఉండాలని, వాటికి జోలికి వెళ్లరాదని గురువారం ఇన్వెస్టర్లను మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ హెచ్చరించింది. ఈ అన్‌రిజిస్టర్డ్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌పై ఎటువంటి నియంత్రణా ఉండదని, మదుపరుల రక్షణ వ్యవస్థ కూడా లేదని ఓ ప్రకటనలో సెబీ పేర్కొన్నది. కంపెనీల చట్టం 2013ను ఉల్లంఘిస్తూ 200లకుపైగా ఇన్వెస్టర్లకు అన్‌లిస్టెడ్ సెక్యూరిటీస్‌ను అక్రమ సంస్థలు ఆఫర్ చేస్తున్నాయని సెబీ గుర్తించింది. ఈ క్రమంలోనే పైవిధంగా మదుపరులను అప్రమత్తం చేసింది. వీటిలో పెట్టుబడులు పెడితే చాలా ప్రమాదమని గుర్తుచేసింది. కాగా, లిస్టెడ్ డెట్ సెక్యూరిటీల్లో పెట్టుబడుల కోసం బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ఆథరైజ్డ్ స్టాక్‌బ్రోకర్లు నిర్వహించే రిజిస్టర్డ్ ఆన్‌లైన్ బాండ్ ప్లాట్‌ఫామ్స్‌లోకి మాత్రమే వెళ్లాలని ఈ సందర్భంగా సెబీ సూచించింది. ఇదిలావుంటే గత 30 రోజుల్లో ఎలాంటి లావాదేవీలు జరుపని క్లయింట్స్ ఖాతాల్లోని ఫండ్స్ సెటిల్మెంట్‌కు సెబీ నడుం బిగించింది. 3 పనిదినాల్లో సమస్యను పరిష్కరించేలా స్టాక్ బ్రోకర్లకు సెబీ సూచిస్తున్నది. అలాగే ఈక్విటీ మార్కెట్లలో క్లోజ్ యాక్షన్ సెషన్‌ను సెబీ పరిచయం చేయాలని చూస్తున్నది. దేశంలోని ఈక్విటీ క్యాష్ మార్కెట్‌లో స్టాక్స్ క్లోజింగ్ ధర నిర్ధారణకే దీన్ని ప్రతిపాదిస్తున్నది. ఇక ఎక్స్ఛేంజీల రిపాజిటరీ ప్లాట్‌ఫామ్‌పై ఐపీవో డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాల్సిందిగా మర్చంట్ బ్యాంకర్లను సెబీ ఆదేశించింది. మరోవైపు ఫిజికల్ సెటిల్మెంట్ తప్పనిసరిగా ఉన్న డెరివేటివ్స్ మార్కెట్‌లో సెటిల్మెంట్ రిస్క్‌లను పరిష్కరించేందుకు ఫ్యూచర్స్‌లోకి ఐటీఎం ఆప్షన్స్ డివాల్వింగ్‌పై ఓ కన్సల్టేషన్ పేపర్‌ను సెబీ ఇచ్చింది.

## వన్‌ప్లస్ 6 వేల కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ, డిసెంబర్ 5: చైనాకు చెందిన స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ వన్‌ప్లస్..భారత్‌లో వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి వచ్చే మూడేండ్లలో రూ.6 వేల కోట్ల పెట్టుబడి పెట్టబోతున్నట్లు ప్రకటించింది. ఇక నుంచి ప్రతియేటా రూ.2 వేల కోట్ల చొప్పున మూడేండ్లపాటు రూ.6 వేల కోట్లను ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి, సర్వీసింగ్‌ను మరింత బలోపేతం చేయడానికి ఖర్చు చేయనున్నట్లు కంపెనీ సీఈవో రోబిన్ లియూ తెలిపారు. దేశీయ మార్కెట్లోకి మరిన్ని మాడళ్లను విడుదల చేయడానికి, కస్టమర్ సర్వీస్ సెంటర్లను, దేశీయ కస్టమర్ల అవసరాలకు తగ్గట్టుగా మాడళ్లను తీర్చిదిద్దడానికి ఈ నిధులు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. వచ్చే రెండేండ్లలో సర్వీస్ సెంటర్లను 50 శాతం మేర పెంచబోతున్నట్లు ఆయన ప్రకటించారు.

## ఈసారీ వడ్డీరేట్లు యథాతథం?

- **నేడే ఆర్బీఐ ద్రవ్యసమీక్ష**

ముంబై, డిసెంబర్ 5: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తమ ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాన్ని శుక్రవారం ప్రకటించబోతున్నది. అయితే ఈసారి కూడా కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. గత ఏడాది ఏప్రిల్ నుంచి రెపో రేటును గరిష్ఠ స్థాయిలోనే సెంట్రల్ బ్యాంక్ ఉంచుతూ వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మరో మారు ఈ రేట్ల జోలికి వెళ్లకుండానే ద్రవ్యసమీక్షను ఆర్బీఐ ముగించవచ్చన్న అభిప్రాయాలు అటు బ్యాంకింగ్, ఇటు ఆర్థిక నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి. రిటైల్, హోల్‌సేల్ ద్రవ్యోల్బణాలు బాగా పెరుగడమే ఇందుకు కారణం. అక్టోబర్‌లో ఏకంగా వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 6.21 శాతానికి చేరిన సంగతి విదితమే. కాగా, మిశ్రమ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)ని తగ్గించే వీలుందన్న అంచనాలున్నాయి. ఇదే జరిగితే బ్యాంకులకు నిధుల లభ్యత పెరుగుతుంది. ఫలితంగా ఆయా రంగాలకు చౌకగా రుణాలు లభిస్తాయి. వడ్డీరేట్లను తగ్గించకుండా ఈ రకంగా మార్కెట్‌కు ఊరటనివ్వాలని ఆర్బీఐ చూస్తున్నదని చెప్తున్నారు.

**మరో 27 టన్నుల గోల్డ్**

రిజర్వు బ్యాంక్ క్రమంగా బంగారం నిల్వలను పెంచుకుంటున్నది. అక్టోబర్ నెలలో సెంట్రల్ బ్యాంకులు 60 టన్నుల గోల్డ్‌ను కొనుగోలు చేయగా, దీంట్లో రిజర్వుబ్యాంక్ అత్యధికంగా 27 టన్నుల గోల్డ్‌ను కొనుగోలు చేసినట్లు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజాగా వెల్లడించింది. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ వరకు మొత్తంగా 77 టన్నుల గోల్డ్ కొనుగోలు చేయగా, దీంట్లో సెంట్రల్ బ్యాంక్ 27 టన్నులు కొనుగోలు చేసినట్లు ఐఎంఎఫ్ విడుదల చేసిన నివేదిక ఆధారంగా డబ్ల్యూజీసీ ఈ విషయాన్ని వెల్లడించింది.

## టీజీఐపాస్‌తో 12 వేల కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్, డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోకి గడిచిన ఏడాదికాలంలో టీజీఐపాస్ ద్వారా 1,901 యూనిట్లకు అనుమతులు మంజూరుకాగా, వీటిద్వారా రూ.12 వేల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ పెట్టుబడులతో సుమారుగా 50 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. ఈ అనుమతులు మంజూరైన వాటిలో 409 యూనిట్లు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించాయి. ఏడాది పాలన సందర్భంగా గురువారం మంత్రి పరిశ్రమల శాఖ సాధించిన ప్రగతి నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..వీటితో పాటు మరో రూ.9,646 కోట్ల పెట్టుబడులకు సంబంధించి 882 యూనిట్ల ఏర్పాటుకోసం దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇవికాకుండా రూ.200కోట్ల కన్నా అధిక పెట్టుబడి, వెయ్యి మందికి మించి ఉద్యోగావకాశాలు కల్పించే మెగా ప్రాజక్టులకు సంబంధించి 16 ప్రతిపాదనలు వచ్చినట్లు, వీటి ద్వారా రూ.14,433 కోట్ల పెట్టుబడులు, 9 వేల ఉద్యోగాలు లభించనున్నాయన్నారు. ములుగు జిల్లాలో మూతపడిన బిల్ట్ పరిశ్రమను తిరిగి తెరిపించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## నైకా ఫ్యాషన్ సీఈవో రాజీనామా

న్యూఢిల్లీ, డిసెంబర్ 5: నైకా ఫ్యాషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి నిహిర్ పరిఖ్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ రాజీనామా వెంటనే అమలులోకి రానున్నదని కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. వ్యక్తిగత అవసరాల నిమిత్తం రాజీనామా చేసిన ఆయనను వెంటనే రిలీవరీ చేసినట్లు కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. కంపెనీ ఆదాయంలో ఈ ఫ్యాషన్ వర్టికల్ 10 శాతం ఆదాయాన్ని ఆర్జిస్తున్నది.



## బ్యాంకాక్ షూట్‌లో 'ఓజీ'



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ'. సుజీత్ దర్శకుడు. చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. నేటి నుంచి బ్యాంకాక్‌లో కీలక షెడ్యూల్‌ను మొదలుపెడుతున్నారు. ఇందులో కథానాయిక ప్రియాంక మోహన్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొనగా ముఖ్య ఘట్టాలను తెరకెక్కించబోతున్నారని తెలిసింది. దీని తర్వాత జనవరి మొదటివారంలో మొదలుపెట్టే చివరి షెడ్యూల్‌లో పవన్‌కల్యాణ్ జాయిన్ అవుతారని, పది రోజుల పాటు జరిగే ఈ షూట్‌లో యాక్షన్ ఎపిసోడ్స్‌ను తెరకెక్కిస్తారని సమాచారం. వచ్చే ఏడాది వేసవిలో ఈ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, అర్జున్‌దాస్, శ్రియా రెడ్డి, ప్రకాష్ రాజ్ తదితరులు కీలక పాత్రలను పోషిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు.

## తొమ్మిదేండ్ల తర్వాత..



'ఖుషి' సినిమాతో దర్శకుడిగా దక్షిణాది ప్రేక్షకుల్లో ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు ఎస్.జె.సూర్య. 2015లో స్వీయ దర్శకత్వంలో తాను నిర్మించి, నటించిన 'ఇసై' చిత్రం పరాజయం కావడంతో దర్శకత్వానికి దూరమై, నటనకు దగ్గరయ్యారాయన. ఇదిలావుంటే.. త్వరలో మళ్లీ ఎస్.జె.సూర్య మెగాఫోన్ పట్టనున్నారట. 'కిల్లర్' అనే కథను కూడా సిద్ధం చేసుకున్నారట. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో తెలిపారు. శంకర్ 'గేమ్ చేంజర్' తర్వాత తన కొత్త ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన విడుదల చేస్తానని ఆయన తెలిపారు. ప్రస్తుతం దర్శకుడిగా అప్‌డేట్ అయ్యే పనిలో ఉన్నానని, నా స్టైల్‌లోనే సినిమాలు తీయాలని నేను అనుకోనని, ప్రస్తుతం నటుడిగా ఇతర దర్శకుల స్టైల్‌ని పరిశీలిస్తున్నానని, త్వరలో తీయబోయే సినిమా తన శైలికి భిన్నంగా ఉంటుందని సూర్య తెలిపారు.

## వినూత్న ప్రేమకథా చిత్రం



దీపక్ సరోజ్, దీక్షిక, అనైరా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. శ్రీలక్ష్మీ నరసింహ ఆర్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై తన్నీరు హరిబాబు నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వేణు ఊడుగుల క్లాప్‌నిచ్చారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ ..వినూత్న ప్రేమకథగా తెరకెక్కించబోతున్నామని, నేటి యువతరం కనెక్ట్ అయ్యే అన్ని అంశాలుంటాయని తెలిపారు. నిర్మాతగా తనకిది తొలి చిత్రమని, జనవరిలో షూటింగ్ మొదలుపెట్టి ఏప్రిల్‌లో కంప్లీట్ చేస్తామని తన్నీరు హరిబాబు పేర్కొన్నారు. రఘుబాబు, హైపర్ ఆది, సత్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సురేష్ రగుతు, సంగీతం: అనూప్ రూబెన్స్, రచన-దర్శకత్వం: హరీష్ గదగాని.

## పెళ్లిపీటలెక్కేది ఆ రోజే?



అగ్ర కథానాయిక కీర్తి సురేష్ తన చిరకాల మిత్రుడు ఆంటోనితో పెళ్లిపీటలెక్కేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఇటీవల తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సందర్భంగా కీర్తి సురేష్ తన పెళ్లి గురించి మాట్లాడింది. గోవాలో పెళ్లి జరుగుతుందని, త్వరలో అన్ని వివరాలను వెల్లడిస్తానని చెప్పింది. తాజాగా కీర్తి సురేష్ పెళ్లి తాలూకు వెడ్డింగ్ కార్డ్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఆహ్వాన పత్రికలో ఈ నెల 12న గోవాలో పెళ్లి జరగనున్నట్లు రాసి ఉంది. అయితే పెళ్లి తేదీకి సంబంధించిన వివరాలను కీర్తి సురేష్ ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. విశ్వసనీయ సమాచారం ప్రకారం మరికొద్ది రోజుల్లో కీర్తి సురేష్ కుటుంబ సభ్యులు పెళ్లి తేదీని ప్రకటిస్తారని తెలిసింది. ఇక కీర్తి సురేష్‌ను పెళ్లాడబోతున్న ఆంటోని ఆమె కాలేజీ స్నేహితుడు. దాదాపు 15 ఏండ్లుగా వీరిమధ్య మంచి స్నేహసంబంధాలున్నాయి. ఇద్దరి కుటుంబాలు కూడా సన్నిహితంగా ఉంటాయని తెలిసింది. ఆంటోని కేరళలో వ్యాపారవేత్తగా రాణిస్తున్నారు. ప్రస్తుతం కీర్తి సురేష్ రివాల్వర్ రీటా, బేబీ జాన్ చిత్రాల్లో నటిస్తున్నది.

## వీటిలో ఏది నిజం?



'పుష్ప-2'తో బాక్సాఫీస్ రికార్డుల అంతుచూసే పనిలో ఉన్నారు అల్లు అర్జున్. తొలిరోజు భారీ వసూళ్లను రాబట్టి, రికార్డులు సృష్టించే దిశగా 'పుష్ప-2' దూసుకుపోతున్నది. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్ తర్వాతి సినిమాపై ఫిల్మ్ సర్కిల్స్‌లో చర్చలు మొదలయ్యాయి. 'పుష్ప-2' ఎండింగ్‌లో 'పుష్ప3'కి లీడ్ ఇచ్చినా.. బన్నీ వెంటనే చేసే సినిమా మాత్రం 'పుష్ప 3' కాదని సమాచారం. ఆయన త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో నెక్ట్స్ సినిమా చేయనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్‌లో త్రివిక్రమ్ ప్రస్తుతం బిజీగా ఉన్నారు. పుష్ప ఫ్రాంచైజీతో మారిన బన్నీ ఇమేజ్‌ని దృష్టిలో పెట్టుకొని, పాన్ ఇండియా రేంజ్‌లో ఉండే కథను రాసుకుంటున్నారట త్రివిక్రమ్. ఏడు వందల కోట్ల భారీ వ్యయంతో హారిక, హాసిని ప్రొడక్షన్స్, గీతా ఆర్ట్స్ సంస్థలు కలిసి ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్టు తెలుస్తున్నది. బన్నీతో త్రివిక్రమ్ చేయబోతున్న తొలి పాన్ ఇండియా ప్రాజెక్ట్ ఇదే కావడంతో.. త్రివిక్రమ్ తయారు చేస్తున్న కథపై ఫిల్మ్ వర్గాల్లో చర్చలు నడుస్తున్నాయి. మైథలాజికల్ టచ్ ఉండే కథతో ఈ సినిమా రూపొందనున్నదని ఓ టాక్. మరోవైపు మంగోలియా యోధుడు చెంఘీజ్‌ఖాన్ చరిత్రలోని కీలకమైన ఎపిసోడ్‌తో త్రివిక్రమ్ ఈ కథ తయారు చేస్తున్నారని, ఇది హిస్టారికల్ మూవీ అని కూడా టాక్ నడుస్తున్నది. మరి ఈ రెండింటిలో ఏది నిజం? అనేది తెలియాల్సివుంది.

## అది కూడా కాపీ కొట్టడమే!



ప్రస్తుతం ఎక్కడ విన్నా 'పుష్ప2' పాటలే వినిపిస్తున్నాయి. గురువారం విడుదలైన ఈ సినిమా విషయంలో దేవిశ్రీప్రసాద్ మ్యూజిక్ గురించి ప్రత్యేకంగా మాట్లాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దేవిశ్రీప్రసాద్ ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. 'క్రియేటివ్ ఫీల్డ్‌లో ఉండే వాళ్లకు ప్రతిభతో పాటు నిజాయితీ అవసరం. నీనుంచి వచ్చే ప్రొడక్ట్ నీదని గర్వంగా చెప్పుకునేలా ఉండాలి. 'నువ్వు చేసిన పాట, ఫలానా మూవీలోని పాటను పోలి ఉంది' అని ఎవరైనా అంటే.. 'నేను స్ఫూర్తి పొందాను..' అని చెప్పడం ఇప్పుడు ఫ్యాషనైపోయింది. నాదృష్టిలో అది కూడా కాపీ కొట్టడమే. పక్కోళ్ల క్రెడిట్‌ని కొట్టేయడం క్రియేటివిటీ అనిపించుకోదు. నా కెరీర్ తొలినాళ్లలో కొందరు దర్శక, నిర్మాతలు కొన్ని సీడీలు నా ముందు పెట్టి 'ఇలాంటి పాటలు కావాలి' అని అడిగేవాళ్లు. 'నేను క్రియేట్ చేయడానికి ఉన్నా కానీ.. కాపీ కొట్టడానికి లేను..' అని వారికి నిర్మొహమాటంగా చెప్పేసేవాడ్ని. ఇప్పటికీ అదేమాటపై కట్టుబడి ఉన్నా. కళారంగంలో ఉన్నవాళ్లకు నైతిక విలువలు అవసరం. కానీ ప్రస్తుతం అవే చాలామందిలో లోపిస్తున్నాయి. సాటి కళాకారుల అవకాశాలను లాక్కోవడం, అందుకోసం ఎంతకైనా దిగజారడం ఇప్పుడు పరిపాటైపోయింది. అవకాశాలకోసం పనిచేయడం వేరు. ఇతరుల అవకాశాలను లాక్కోవడం కోసం పనిచేయడం వేరు. మొదటిది తప్పుకాదు. రెండోది సరైనది కాదు' అంటూ దేవిశ్రీప్రసాద్ చెప్పుకొచ్చారు.

## నేను కొట్టడం తప్పే



గత ఏడాది నవంబర్‌లో నానా పటేకర్ 'వనవాస్' సినిమా షూటింగ్ వారణాసిలో జరిగింది. అది అవుట్‌డోర్ షూటింగ్ కావడంతో షూటింగ్ చూడటానికి జనం ఎగబడ్డారు. షూటింగ్ మంచి రసపట్టులో ఉంది.. ఇంతలో సడెన్‌గా ఓ యువకుడు ఫీల్డ్‌లోకి చొరబడి నానా పటేకర్ పక్కన నిలబడి సెల్ఫీ దిగబోయాడు. దాంతో అసహనానికి లోనైన పటేకర్, ఆ కుర్రాడి తలపై గట్టిగా కొట్టారు. వెంటనే సెక్యూరిటీ రంగంలోకి దిగి ఆ కుర్రాడ్ని పక్కకు లాగేసింది. అయితే.. ఈ తతంగాన్నంతా అప్పటికే పలువురు తమ ఫోన్ల ద్వారా వీడియోలు తీసేశారు. ఆ వీడియోలు విపరీతంగా ట్రోల్ అవ్వడంతో, దాని వల్ల నానా పటేకర్ తీవ్రమైన విమర్శలెదుర్కోవలసి వచ్చింది. ఇదిలావుంటే.. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఏడాది క్రితం జరిగిన ఈ విషయాన్ని నానా పటేకర్ గుర్తు చేసుకున్నారు. 'నిజంగా నేను చాలా తొందరపడ్డాను. అప్పుడు నేను షాట్‌లో ఉన్నా. లొకేషన్ అంతా బిజీగా ఉంది. అలాంటి సమయంలో ఆ అబ్బాయి ఫొటో కోసం నా పక్కన నిలబడ్డాడు. అది తను తెలియక చేశాడు. ఆ విషయం గ్రహించకుండా నేను కొట్టడం తప్పే. అతను అభిమానంతోనే కదా నా దగ్గరకొచ్చాడు. షూటింగ్ గ్యాప్‌లో ఆ కుర్రాడు నా దగ్గరకు వచ్చి ఉంటే నా స్పందన వేరేలా ఉండేది' అన్నారు నానా పటేకర్.

## ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్



కవిన్, అపర్ణదాస్ ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'డా..డా' అక్కడ మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమా 'పా..పా' పేరుతో తెలుగులో రానుంది. జేకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నీరజ కోట తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకురానుంది. దర్శకుడు మారుతి ఇటీవల ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ఈ సినిమా కథాంశం తెలుగు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుందన్నారు. తండ్రీకొడుకుల సెంటిమెంట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం తమిళంలో 30 కోట్లకుపైగా వసూళ్లను సాధించిందని, ఫీల్‌గుడ్ ఫ్యామిలీ డ్రామాగా ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. భాగ్యరాజా, వీటీవీ గణేష్, ఐశ్వర్య, ప్రదీప్‌శక్తి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: జెన్‌మార్టిన్, దర్శకత్వం: గణేష్ కె బాబు.